## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: హనుమకొండ సుబేదారిలోని కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రామాలయం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ డీఈ సాంబారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూకాలనీ, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఆయన పేర్కొన్నారు.

### నేడు వన మహోత్సవం

కేయూ క్యాంపస్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5న కాకతీయ యూనివర్సిటీలోని కేహబ్ ప్రాంగణంలో ఉదయం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం తెలిపారు. విశ్వవిద్యాలయంలోని జాతీయ సేవాపథకం, అవెన్యూ ప్లాంటేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

### సైలెన్సర్లు మారిస్తే చర్యలు

కాజీపేట: ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పిడి చేసి రహదారులపై ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికి ప్రయత్నించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ వెంకన్న హెచ్చరించారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సైలెన్సర్లు మార్చి తిరుగుతున్న వాహనదారులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ వాహనాల సైలెన్సర్లను తొలగించి సాధారణ సైలెన్సర్లను బిగింపజేశారు. తనిఖీల్లో ఎస్సైలు కనకచంద్రం, సంపత్, రామారావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### రావి నారాయణ రెడ్డికి నివాళి

న్యూశాయంపేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి 118వ జయంతి వేడుకలను హనుమకొండ సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, ఎల్లేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సదాలక్ష్మి, ఎస్ఏ.స్టాలిన్, నాయకులు ఓదెలు, రాజు, మునిగాల భిక్షపతి, రమాదేవి, శ్రీనివాస్, దీన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### టైల్స్ డీలర్స్ అసోసియేషన్ ఎన్నిక



కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని క్షేత్ర బాంక్వెట్ హాల్‌లో జిల్లా టైల్స్ డీలర్స్ అసోసియేషన్ నూతనంగా కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా గుండేటి నరేందర్, అధ్యక్షుడిగా షేక్ రాయిసుద్దీన్, ఉపాధ్యక్షుడు చెన్నూరి కిరణ్‌రెడ్డి, కార్యదర్శి అంబాల శ్రవణ్, కోశాధికారి వడ్లమూడి యాక నారాయణ, సహాయ కార్యదర్శిగా పిట్ట భరత్‌కుమార్‌ను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు.

### బాధిత కుటుంబాలకు చేయూత



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని 10వ డివిజన్‌కు చెందిన నిరుపేద కుటుంబాలకు బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు నాసం కరుణ చేయూతనందించారు. డివిజన్‌కు చెందిన అక్తర్ అహ్మద్ కొద్దికాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా, ఆ కుటుంబానికి 25 కిలోల బియ్యం, అలాగే, మృతి చెందిన రావుల్‌కార్ శ్రీనివాస్ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. నాయకులు చొల్లేటి కృష్ణమాచార్యులు, ఎడెల్లి ఎల్లారెడ్డి, మైస రాజ్‌కుమార్, కోల సురేందర్, పులి పుష్ప, పిట్టల శ్రీలత, మేకల శంకర్ పాల్గొన్నారు.

### సద్వినియోగం చేసుకోవాలి



కాజీపేట: అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతిని ప్రవేశ పెట్టిందని, రైతులు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ భావ్‌సింగ్ సూచించారు. కాజీపేట మండలం సోమిడి ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 86 మంది రైతుల నుంచి వివిధ అభ్యంతరాలతో కూడిన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### విత్తన కేంద్రాల్లో తనిఖీలు

కాజీపేట: కాజీపేట పట్టణంలో విత్తన విక్రయ కేంద్రాలపై పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఐ వై.సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో పలు దుకాణాలపై ఏకకాలంలో సోదాలు చేశారు. కల్తీ విత్తనాలు విక్రయించినా, అధిక ధరలకు అమ్మినా చర్యలు తీసుకుంటామని వ్యాపారులను అధికారులు హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి సంతోష్, ఎస్సై నవీన్‌కుమార్, శివకృష్ణ పాల్గొన్నారు.

# శివనగర్‌లో కోతుల బీభత్సం

- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని బల్దియా అధికారులు



శివనగర్‌లో సంచరిస్తున్న కోతులు



ఇంట్లోకి చొరబడుతున్న వానరాలు

ఖిలా వరంగల్: జనారణ్యంలో సంచరిస్తున్న వానరాలతో ప్రజలు భీతిల్లుతున్నారు. గుంపులుగా తిరుగుతూ ఇళ్లు, దుకాణాల్లో చొరబడి ఆహార పదార్థాలు, సరుకులను ఎత్తుకెళ్తున్నాయి. ఇంటి ఆవరణల్లోని మామిడి, జామ, సపోట, అరటి చెట్లను ధ్వంసం చేయడంతోపాటు కాయలను కొరికి కింద పడేస్తున్నాయి. ప్రయాణికులు, వాహనదారులను వెంబడించి దాడిచేసి గాయపరుస్తున్నాయి. ఈక్రమంలో కోతుల భయంతో మహిళలు, పిల్లలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు.

వరంగల్ శివనగర్ 34, 35వ డివిజన్లలో కోతుల బెడద అధికంగా ఉంది. వందల సంఖ్యలో కోతులు గుంపులుగా తిరుగుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి తినుబండారాలు, వంట సామగ్రి, గిన్నెలు, పప్పు డబ్బాలు, సరుకులు, ఏది దొరికితే దాన్ని ఎత్తుకెళ్తున్నాయి. బాటసారుల చేతిలో కవర్ కనబడితే చాలు దాడిచేసి ఎత్తుకెళ్తున్నాయి.

### కోతులను చూస్తే భయమేస్తోంది



శివనగర్‌లో కోతుల బెడదతో భయభ్రాంతులకు గురవుతున్నాం. ఇళ్లల్లోని మామిడి, సపోట చెట్లపై తిష్టవేసి ధ్వంసం చేస్తూ, కాయలను కొరికి కుప్ప పోస్తున్నాయి. చేతిలో కవర్‌తో రోడ్డుపై వెళ్తే దాడి చేసి ఎత్తుకెళ్తున్నాయి. చేతిలో కర్రలేనిది రోడ్డుపై నడువలేని పరిస్థితి నెలకొంది.

- రావికంటి అశోక్, శివనగర్

### పట్టుకుని అడవికి తరలిస్తున్నాం



శివనగర్‌లో కోతులు గుంపులుగా తిరుగుతున్నాయి. బల్దియా సిబ్బంది నెలకు రెండు సార్లు కోతులను పడుతున్నాయి. గతంలో కంటే ఇప్పుడు చాలా వరకు కోతుల సంచారం తగ్గింది. వీధికి ఒక్కటి చొప్పున కోతుల బోన్లను ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటున్నాం.

- దిడ్డి కుమారస్వామి, 34వ డివిజన్

# గత ప్రభుత్వ నిర్లక్ష్యం పేదలకు శాపం

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

హన్మకొండ అర్బన్: హనుమకొండ అంబేడ్కర్ కాలనీలోని పేదలకు గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి, అర్హులైన పేదలకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆరోపించారు. అంబేడ్కర్ కాలనీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించి వదిలేసిన డబుల్ బెడ్రూం ఇళ్లను పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో 592 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి, స్థానికంగా 20 నుంచి 30 ఏళ్లుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారికి ఇస్తామని చెప్పి, కేవలం 6 కుటుంబాలకు మాత్రమే ఇంటి పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకోవడం అన్యాయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు చొరవ తీసుకొని అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు స్టాలిన్, నాయకులు మునిగాల భిక్షపతి, వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్, నకీర్త ఓదెలు, ఎశబోయిన శ్రీనివాస్, ధర్మరాజు, మద్దెల శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

# కార్మికులకు ఇళ్లు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే దళిత, బలహీన వర్గాలకు చెందిన కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ) అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, ఏల్పుల ధర్మరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ నాయకులతో కలిసి కలెక్టరేట్‌లో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడబ్ల్యూఎంసీలో నిరుపేదలైన దళిత బలహీన వర్గాలకు చెందిన కార్మికులు, ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారని తెలిపారు. అలాగే, కార్మికులకు రేషన్ కార్డులు, వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య రక్షణ కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొక్క ఏలియా, శ్రీనివాస్, శంకర్, ఎల్లస్వామి, ప్రదీప్ కుమార్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు పార్టీకి వారధి సోషల్ మీడియా



డైరీ, ఇన్సూరెన్స్‌లను అందజేస్తున్న పీసీసీ సభ్యులు

హన్మకొండ చౌరస్తా: పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా పాత్ర కీలకమైందని, పార్టీకి ప్రజలకు మధ్య వారధిగా సోషల్ మీడియా కోఆర్డినేటర్లు చేస్తున్న కృషి మరువలేనిదని టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండలోని కాంగ్రెస్ భవన్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు ఇన్సూరెన్స్, ఐడీ కార్డులు, ప్రత్యేక డైరీలను బుధవారం అందజేశారు. టీజీటీఎస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సతీష్, వరంగల్ పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మహ్మద్ నేహాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వారు మాట్లాడుతూ సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు భద్రత కల్పించడం అవసరమన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి బైరబోయిన రమేష్, నియోజకవర్గం, డివిజన్ల కోఆర్డినేటర్లు రోషన్ గైక్వాడ్, సాయికృష్ణ, సురేందర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల సంక్షేమానికి కృషి



ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తున్న మురళి

ఖిలా వరంగల్: గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. వరంగల్ కరీమాబాద్‌లోని లల్లీ కన్వెన్షన్ హాల్‌లో గీత కార్మిక, గౌడ కులస్తుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా 80 మంది గౌడ కులస్తులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణంతోపాటు రూ.50 లక్షల వ్యయంతో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కుల వృత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. గీత కార్మికులకు సర్కారు కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తోందని గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్ నవీన్‌రాజ్, మీసాల ప్రకాశ్, మాజీ కార్పొరేటర్ బత్తిని వసుంధర, నాగపూరి కల్పన, శోభ, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, బత్తిని అఖిల్, శ్యామ్, సుధాకర్, మండ వెంకన్న, బత్తిని హరి, సతీష్, నాగపూరి సంజయ్ బాబు, కుమారస్వామి, బుజ్జిబాబు, గడ్డం యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని పాఠశాలను సీజ్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘాల నాయకులు



విద్యారణ్యపురి: డీఈఓకు వినతిపత్రం అందజేస్తూ..

రామన్నపేట: అనుమతి లేకుండా నగరంలోని స్థాపించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న షాహీన్ హైస్కూల్‌ను సీజ్ చేసి యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ మండల విద్యాశాఖ అధికారి అశోక్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్, ఏఐఎస్‌బీ కార్యదర్శి రోహిత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ హరీష్ పాల్గొన్నారు.

### అధిక ఫీజులను నియంత్రించాలి

విద్యారణ్యపురి: ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు బాధ్యులతో కలిసి వరంగల్ డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు ఉచితంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రకాశ్, రాజేష్, అనిల్ పాల్గొన్నారు.

### నేడు జిల్లా వ్యవసాయ అధికారితో సాక్షి ఫోన్ ఇన్



ఖిలావరంగల్: వానాకాలం సీజన్ ప్రారంభం కాగా అన్నదాతలు పంటల సాగు పనుల్లో బిజీ అయ్యారు. ఈ క్రమంలో **ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కొనుగోళ్లలో** ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, **నకిలీల బెడద** నుంచి ఎలా జాగ్రత్త పడాలి, **పంటల సాగుపై సందేహాల నివృత్తి, సూచనలు, సలహాల** కోసం వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి అనురాధతో 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. రైతులు నేరుగా జిల్లా వ్యవసాయ అధికారికి ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

తేదీ : 05-06-2025(గురువారం)
ఫోన్ చేయాల్సిన నంబర్:
89777 56214
సమయం : ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు

### కళాశాలలో తాగునీరు ఏర్పాటు

కేయూ క్యాంపస్: కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ముగ్గురు రిటైర్డ్ ప్రొఫెసర్ల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన శుద్ధమైన తాగునీటి వసతి సదుపాయాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంతో కలిసి కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ జీవీ.భవానిప్రసాద్, రాజేశం, పి.కృష్ణమాచారి కలిసి రూ.34 వేల వ్యయంతో నీటి సదుపాయాన్ని కల్పించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అమరవేణి, డీన్ ప్రొఫెసర్ రాజేందర్, బీఓఎస్ ప్రొఫెసర్ వరలక్ష్మి, యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నర్సింహాచారి పాల్గొన్నారు.

# స్కాలర్స్ మంచి పరిశోధనలు చేయాలి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: స్కాలర్స్ సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం సూచించారు. కాకతీయ యూనివర్సిటీలో రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సెమినార్ హాల్‌లో పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో అనేక సమస్యలున్నాయని, వాటికి పరిష్కార మార్గం చూపే విధంగా పరిశోధనలు చేయాలని అన్నారు. పరిశోధకులు తమ పరిశోధనకు పీహెచ్‌డీ థీసిస్ రూపొందించడంలో సీనియర్ ప్రొఫెసర్ల సలహాలు, సూచనలు తీసుకోవాలని చెప్పారు. కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ పింగిళి నర్సింహారావు మాట్లాడుతూ సామాజిక పనితీరును అవగాహన చేసుకోవడం, వ్యక్తుల ప్రవర్తనను అధ్యయనం చేయడం, సామాజిక సమస్యలకు పరిష్కార మార్గాలను వెతకడం, సామాజిక సమస్యలపై వాస్తవికతలను పరిశీలించి వివరించాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ సమావేశంలో రాజనీతి శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, బీఓఎస్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, తెలుగు విభాగం అధిపతి డాక్టర్ మామిడి లింగయ్య, సోషల్ సైన్సెస్ విభాగాల పరిశోధకులు, తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

న్యూశాయంపేట: వచ్చేనెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ బిల్డింగ్ యూనియన్ హనుమకొండ జిల్లా తీర్మానం చేసింది. హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సూచించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రైవేటీకరణను కేంద్రం ఆపాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మె గురించి అన్ని వర్గాల కార్మికులకు తెలిసేలా క్షేత్రస్థాయికి వెళ్లి ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పి.అశోక్, బి.శ్రీనివాస్, వి.లింగమూర్తి, రాధ, అనిత, రాజు, మల్లయ్య, కుమార్, స్వామి, సాంబయ్య, మేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

న్యూశాయంపేట: వరంగల్ ఎంజీఎంలో వృద్ధుల కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ ప్రతినిధులు కోరారు. ఈమేరకు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారదను కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 2007 తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం, 2011 నియమాల ప్రకారం ప్రాణాంతక వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులకు ఒకేచోట వైద్య సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని 20 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అవుట్ పేషెంట్ల కోసం ప్రత్యేక విభాగం చేయడం వల్ల వయోవృద్ధులకు త్వరితగతిన వైద్యసేవలు అందుతాయన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కార్యదర్శి యుగేందర్, మార్క రవీందర్‌గౌడ్, గంగారపు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చర్లలో బొడ్రాయి వేడుకలు



దేవతామూర్తుల విగ్రహాల ప్రదర్శన

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ముచ్చర్లలో బొడ్రాయి పునః ప్రతిష్ఠాత్మక వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని పురస్కరించుకుని భూలక్ష్మి సమేత బొడ్రాయి (గ్రామ దేవతల) విగ్రహాల భారీ ప్రదర్శనను నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఈ ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా విగ్రహాలకు గ్రామస్తులు జలాభిషేకం చేశారు. ఈ వేడుకలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బొడ్రాయి కమిటీ సభ్యులు పెద్ది ఇంద్రాసేనారెడ్డి, మడూరి మనోహర్, చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, పెద్ది మహేందర్‌రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, సూర ప్రతాప్, దామెర సారయ్య, శ్యామ్, సూర ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

విద్యారణ్యపురి: హనుమకొండ ప్రభుత్వ పింగిళి డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. పింగిళి కళాశాలలో 2025 – 2026లో అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాలను తన క్యాంపు కార్యాలయంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళితో కలిసి బుధవారం ఆవిష్కరించారు.

### ఓరుగల్లు రంగస్థల కళాకారుల సంస్మరణ సభ

హన్మకొండ కల్చరల్: ఇటీవల మరణించిన వరంగల్‌కు చెందిన రంగస్థల కళాకారులు చక్రహరి సురేందర్‌రావు, బలగం ఫేం జీవీ బాబు, శతపతి శ్యామలరావు సంస్మరణ సభను వరంగల్ పోతన విజ్ఞాన పీఠం ఆడిటోరియంలో బుధవారం రాత్రి నిర్వహించారు. వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య అధ్యక్షతన జరిగిన సభలో కళాకారులు ఎన్ఎస్ఆర్ మూర్తి, జీఎస్.శర్మ, ఒడపల్లి చక్రపాణి, శ్రీరామోజు సుందరమూర్తి, పందిళ్ల అశోక్‌బాబు, గూడూరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదాం

విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదామని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు హనుమకొండలో బుధవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ అనంత్, బాధ్యులు రమేష్, నర్సయ్య, సత్యనారాయణ, సురేందర్, రాములు, రాంబాబు, రాజమౌళి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

### నేత్రదానం



శివసాయి (ఫైల్)

ఎంజీఎం: పెద్దపల్లి జిల్లా రామగుండానికి చెందిన చింతకింద శివసాయి (29) ఇటీవల కారు ప్రమాదంలో మృతి చెందగా, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎంలో భద్రపర్చారు. బాధితుడి తల్లిదండ్రులు రమేష్‌బాబు – రాజమణి దంపతులు తమ కుమారుడి కళ్లను దానం చేయడానికి ముందుకు వచ్చారు. ఈమేరకు మృతుడి నేత్రాలను వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల, ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ టెక్నీషియన్ రాజేందర్ బుధవారం సేకరించారు.

### బాధితుడికి బ్యాగు అప్పగింత

కాజీపేట రూరల్: ఓ ప్రయాణికుడు రైల్లో ప్రయాణిస్తూ మరిచిపోయిన బ్యాగును కాజీపేట జీఆర్పీ పోలీసులు బుధవారం అప్పగించారు. కాజీపేట జీఆర్పీ సీఐ వి.నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ లింగంపల్లికి చెందిన కురుమ మల్లేశ్వర్ కుటుంబం కలిసితో యాదాద్రి వెళ్లేందుకు అడప్సర్ రైల్ నుంచి భువనగిరి స్టేషన్‌లో దిగుతూ తన లగేజ్ బ్యాగును మరిచిపోయాడు. అనంతరం బాధితుడి ఫిర్యాదు మేరకు జీఆర్పీ ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్, కానిస్టేబుల్ ప్రభాకర్ అప్రమత్తమై ఆ బ్యాగును గుర్తించి అప్పగించారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ ఈద్గా మైదానంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి రూ.5 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్ బిలాల్, ఖురేసి సయ్యద్, ఆసిఫ్, ఇస్మాయిల్, హెలెన్ టాయ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని హరిహర పుత్రుడు అయ్యప్పస్వామికి బుధవారం ఉత్తర నక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు. దేవాలయ ఇన్‌చార్జ్ చొక్కారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోలనకొండ శ్రీనివాస్ విశేష పూజలు జరిపించారు.

### ఆ అధికారిపై చర్య తీసుకోవాలి

కాజీపేట రూరల్: ఎస్సీ, ఎస్టీ గురుకులాల పిల్లలను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణిపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శి పసునూరి మనోహర్, జాతీయ ఉపాధ్యక్షుడు చిన్నపెల్లి కొమురయ్య ఒక ప్రకటనలో కోరారు.

### యువకుడి ఆత్మహత్య

కాజీపేట: కాజీపేట ఇందిరమ్మ కాలనీకి చెందిన మాలోతు శోభన్ బాబు (39) తాగుడుకు బానిసై అడిగిన వెంటనే కుటుంబ సభ్యులను డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

### వృద్ధుడి బలవన్మరణం

కాజీపేట: కాజీపేటకు చెందిన కొక్కొండ రాంమూర్తి (89) మానసిక వ్యాధితో బాధపడుతూ బుధవారం యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఇంట్లో ఉన్న యాసిడ్ తాగగా, కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. మృతుడి భార్య సక్కుబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

# మోదీ పాలనపై ప్రజలకు విశ్వాసం, నమ్మకం



హన్మకొండ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనపై ప్రజల్లో విశ్వాసం, నమ్మకం ఉందని బీజేపీ నేత, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ అన్నారు. 11 ఏళ్ల మోదీ ప్రభుత్వం.. సంకల్పంతో సాకారం అనే అంశంపై హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యశాల జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీఏ హయాం అంతా కుంభకోణాలమయమే అని ఆరోపించారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ ఎంపీ సీతారాం నాయక్, నాయకులు దేవేందర్ రెడ్డి, కాశీప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, సంద్ర మధు పాల్గొన్నారు.